నూరేళ్ళ తెలుగు కథకు

నవ్య నీరాజనం - 38




# కథల్ని పాత్రలు నడిపిస్తాయి, రచయితలు కాదు

## - వనశ్రీ (వాసిరెడ్డి నారాయణరావు)

ఆయకు కథలంటే ఇష్టం. కబుర్లంటే ఇష్టం. నాటకాలు, నవలలంటే మరీ మరీ ఇష్టం. బ్యూరోక్రాట్‌గా వృత్తి బాధ్యతలు నిర్వహించినా ఆయన పేదల మనిషి. అందుకే కలం పట్టారు. 'వనశ్రీ' పేరిట కథలు రాశారు. ఆ కథల్ని చక్కని సంభాషణలు, మంచి శైలి, నేటి సాంఘిక రాజకీయ ఆర్థికాది సమస్యల చిత్రీకరణ అంటూ తెగ మెచ్చుకున్నారు తాపీ ధర్మారావు. ఆయన డిటెక్టివ్ నవలా రచయిత కూడా. 'నరేంద్ర' పేరిట అపరాధ పరిశోధన సాహిత్యాన్ని పండించారు. అందులో కూడా సామాజిక ప్రయోజనాన్ని జొప్పించారు. అందుకే ఆ నవలల్ని కొడవటిగంటి ఇష్టపడ్డారు. ఇష్టపడి ఆట పట్టించలేదు. ప్రముఖ రచయిత్రి వాసిరెడ్డి సీతాదేవి ఆయనకి అక్కయ్య. అయితే ఆమె కన్నా ముందే ఆయన రచయిత. ఆయన అసలు పేరు వాసిరెడ్డి నారాయణరావు. వారితో ఇంటర్వ్యూ ఈవారం మీ కోసం...

'వనశ్రీ' అన్నది నా కలం పేరు. నా అసలు పేరు వాసిరెడ్డి నారాయణరావు. నేను 15 నవంబరు 1929లో పుట్టాను. మా నాన్నగారి పేరు వాసిరెడ్డి రాఘవయ్య. అమ్మపేరు రంగనాయకమ్మ. ప్రముఖ రచయిత్రి వాసిరెడ్డి సీతాదేవి మా అక్కయ్య. చేబ్రోలు (గుంటూరు జిల్లా)లో మా నాన్నగారు వ్యవసాయం చేసేవారు. మా తాతగారు ధర్మకర్తలు. వారు ఆలయాల్లో నందులు పెట్టించడం, దేవితా విగ్రహాలకు బంగారు కళ్ళు పెట్టించడంలాంటివి చేసేవారు. ఒకరకంగా వారికది అలవాటు. మా చుట్టుప్రక్కలంతా అందరూ బ్రాహ్మలే ఉండేవారు. ఎక్కువగా పూజారులుండేవారు. వారితో చిన్నప్పటి నుంచి కలసిమెలసి తిరగడంతో బ్రాహ్మణ సంస్కృతి బాగా నాకు వంటబట్టింది.



శ్రీమతి సక్కుబాయితో...

## ఆటలంటే ఆనందం

అల్లరి అంటే చిన్నతనంలో అందరూ చేసినట్టుగానే నేనూ, అక్కయ్య అల్లరి చేసేవాళ్ళం. సీతాదేవి బాగా మొండిగా ఉండేది. నాకైతే పట్టు విడుపులుండేవి. చదువంటే పెద్దగా ఆసక్తి ఉండేది కాదు. ఆటలంటే ఆనందపడేవాణ్ణి. మాస్టర్‌కి కనిపిస్తే చదివించేందుకు ఎక్కడ తీసుకుని వెళ్తాడోనని, ఆయనకు కనిపించకుండా బియ్యం బానల్లో దాగునేవాణ్ణి. అందులో బుసగా ఊపిరి తీయడంతో నేనెక్కడున్నదీ కనిపెట్టి మాస్టర్ నన్ను చదివించేందుకు తీసుకుని వెళ్ళేవారు. నాన్న పెద్దగా చదువును పట్టించుకునేవారుకాదుగాని, అమ్మకి చదువంటే గట్టి అభిప్రాయం ఉండేది. పిల్లలు చదువుకోవాలని పట్టుబట్టేదామె.


## ఆ రోజులు బలేగా ఉండేవి

ఎనిమిదో తరగతి వరకు చేబ్రోలులోనే చదువుకున్నాను. ఆ రోజులు బలేగా ఉండేవి. స్కూలు ఎగ్గొట్టి కాలవల్లో స్నానాలు చేసేవాళ్ళం. ముఖం మీది బురదని గుర్తు పట్టి 'నువ్వు స్కూలెగ్గొట్టి కాలవలో స్నానం చేశావు కదూ' అని అమ్మ అడిగితే...ఏం చెప్పాలో తెలీక నీళ్ళు నమిలేవాణ్ణి. కొన్నాళ్ళకు అతి తెలివి ప్రదర్శించి ముఖమ్మీది బురద మరకలు కనిపించకుండా ఉండేందుకు కొబ్బరి నూనె రాసుకుని ఇంటికొచ్చేవాణ్ణి. అమ్మ నా నూనె ముఖాన్ని చూసి కూడా అదే మాట అనేది. దొరికిపోయినందుకు నన్ను నేనే తిట్టుకునేవాణ్ణి.

## ఫస్టియర్లో క్లాసులా!

ఇంటర్మీడియెట్ గుంటూరులో చదువుకున్నాను. అక్కడ ఎ.సి. కాలేజీలో జాయినయ్యాను. ఫస్టియర్లో క్లాసుకు వెళ్ళిన పాపానపోలేదు. ఎప్పుడయినా సరదాగా వెళ్దామనుకుంటే...'ఫస్టియర్లో క్లాసులేంటి' అని సీనియర్లు వెళ్ళనిచ్చేవారు కాదు. ఆ రోజుల్లోనే స్టూడెంట్ ఫెడరేషన్‌తో సంబంధాలు ఏర్పడ్డాయి. అప్పుడే చిన్నయసూరి మిత్రలాభం, మిత్రభేదంలాంటి పుస్తకాలు చదువుకున్నాను. సీతాదేవయితే కొవ్వలి, జంపనల నవలలు తెగ చదివేది.

అమ్మా, నాన్న, సోదరితో వనశ్రీ దంపతులు



## తీగ తెచ్చిన సంపద


నిజం చెప్పాలంటే...చదువుకునేందుకు నేనూ సీతాదేవి చెన్నయి వెళ్ళేంత వరకు మాకు తెలుగుభాషలోగాని, తెలుగు సాహిత్యంలోగాని ఎటువంటి ప్రవేశం లేకపోయింది. చెన్నయిలో మా అమ్మమ్మ మాకు పెద్ద దిక్కుగా ఉండేది. అప్పుడే దాసరి సుబ్రహ్మణ్యం ఉద్యోగం కోసం చెన్నయి వచ్చి, జార్జిటౌన్‌లో ఓ తెలుగు ప్రెస్సులో పని చేస్తూ మా ఇంట్లో ఉండేవాడు. ఆయన పుస్తకాలు తెగ చదివేవాడు. కథలు కూడా రాసేవాడు. ఆయన కథలు అందులోనూ ఇందులోను పడుతోంటే చూపించి ఆనందించేవాడు. ఆ ఆనందం నాకూ కావాలనిపించింది. 'కథలెలా రాస్తారు' ఓ రోజు సుబ్రహ్మణ్యాన్ని అడిగాను. 'ఎలా రాస్తారో నువ్వు రాస్తే నీకే తెలుస్తుంది! నువ్వు రాయగలవు. రాయి' అన్నాడు సుబ్రహ్మణ్యం. అంతే! తెలుగు పత్రికలు చదవడం ప్రారంభించాను. చదివి చదివి ఆఖరికి ఎలాగయితేనేం ఓ కథ రాశాను. ఆ కథ పేరు 'తీగె తెచ్చిన సంపద' అది 'తెలుగు స్వతంత్ర'లో 'వనశ్రీ' పేరిట అచ్చయింది. సీతాదేవి కన్నా ముందే నా కథే ప్రచురణకు నోచుకుంది.


## ప్రోగ్రెసివ్ లిటరేచర్ బాగా చదువుకున్నాను


ఎప్పుడయితే నా కథ అచ్చుకు నోచుకుందో అప్పుణ్ణుంచి దాసరి సుబ్రహ్మణ్యానికి నేనంటే మరింత ఇష్టం ఏర్పడింది. ఆ ఇష్టంతో ఆయన నేను రాసిన కథలన్నీ ఓపిగ్గా చదివి, దిద్ది ఏ కథ ఏ పత్రికకు పంపాలో చెప్పి పంపించేవాడు. అలాగే వెరీ సెలెక్టివ్ బుక్స్ ఇంగ్లీషువి ఇచ్చి చదివించేవాడు. అప్పుడే అమెరికన్ లిటరేచర్లో ప్రోగ్రెసివ్ లిటరేచర్ బాగా చదువుకున్నాను. అప్పటి నుంచే నేను సీరియస్‌గా రాయడం మొదలుపెట్టాను. ఉద్యోగరీత్యా నిడదవోలులో ఉన్నప్పుడు...కథ రాయాలనిపించినప్పుడు...నిడదవోలు రైల్వేస్టేషన్ వెయిటింగ్ రూంలో కూర్చుని కథ రాసేసేవాణ్ణి. సాయంత్రం మెయిల్ వచ్చే టైంకి కథ అయిపోవాలి. అయిపోతే మెయిల్ పోస్ట్ డబ్బాలో కథ వేసి తిరిగొచ్చేవాణ్ణి. పంపించిన కథ ప్రింటయ్యే వరకు మరో కథ రాసేవాణ్ణి కాను. ఆంధ్రపత్రిక, తెలుగు స్వతంత్రలోనే నా కథలన్నీ అచ్చయ్యేవి. స్వతంత్రకయితే సెటైర్ ఉండాలని అలా రాసేవాణ్ణి. పత్రికకయితే సెంటిమెంట్‌ను పండించేవాణ్ణి.

## కథల్ని పాత్రలే నడిపిస్తాయి.

చెన్నయ్‌లో డైరెక్టర్ ఆఫ్ ఫిషరీస్‌లో ఉద్యోగినయ్యాను. ఆనాటికి దాసరి సుబ్రహ్మణ్యం చందమామలో చేరారు. అప్పుడే కొడవటిగంటితో పరిచయం ఏర్పడింది. ఆ రోజుల్లో ఆంధ్రజ్యోతి మాసపత్రికగా వెలువడేది. చక్రపాణిగారు దానికి ఎడిటర్‌గా ఉంటే...కొడవటిగంటిగారు దానికి వర్కింగ్ ఎడిటర్‌గా ఉండేవారు. కొడవటిగంటితో కబు


సర్వేపల్లి రాధాకృష్ణన్‌తో...


మిత్రుడు తాపీ చాణక్యతో...


వనశ్రీ పెళ్ళికి పౌరోహిత్యం వహించిన త్రిపురనేని గోపీచంద్, దాశరధి కృష్ణమాచారి

ర్లాడుతూ గంటలగ్గంటలు కూర్చునేవాణ్ణి. అయితే ఆ కబుర్లలో రాజకీయాలు, సైన్సు తప్ప సాహిత్యం ఎప్పుడూ తొంగిచూసేది కాదు. కాని చాలామంది మిత్రులు మేమిద్దరం సాహిత్యం గురించే మాట్లాడుకుంటామనుకునేవారు. అదే చిత్రం. ఓ రోజు కథేదో చించేస్తున్నారు కొడవటిగంటి. 'ఏంటిసార్ కథ చించేస్తున్నారు' అనడిగాను. 'పాత్ర అడ్డం తిరిగింది! దాంతో' అని చించేశారు దాన్ని. అప్పుడో రహస్యం నాకు తెలిసింది. కథల్ని పాత్రలే నడిపిస్తాయి. రచయితలు కాదు అని.

## డిటెక్టివ్ నవలా రచయిత 'నరేంద్ర' నేనే!

1955 నుంచి డిటెక్టివ్ కథలు-నవలలు రాయడం మొదలెట్టాను. ఇవి రాయడానికి కూడా దాసరి సుబ్రహ్మణ్యంగారే కారకులు. టెంపోరావ్, ధనికొండ హనుమంతరావులు రెండు చేతులా ఆ రోజుల్లో డిటెక్టివ్ సాహిత్యాన్ని సృష్టించేవారు. అప్పట్లో స్టేట్ గెజిటెడ్ ఆఫీసరు జీతం రూ. 275. డిటెక్టివ్ నవల రాసి మనమే ప్రింట్ చేసి అమ్ముకుంటే నెలకి రూ. 1000 మిగిలేది. దీన్ని దృష్టిలో పెట్టుకుని 'ప్రగతి' ప్రచురణలు ప్రారంభించాం. తాపీచాణక్య భాగస్వామి అయితే హనుమంతరావు(ప్రగతి) మేనేజర్‌గా వ్యవహరించేవాడు. 'నరేంద్ర' పేరుతో డిటెక్టివ్ నవలలు రాసేవాణ్ణి. నా నవలలకి ప్రకటనలు బలేగా ఉండేవి. పొర్లుకుంటూ దొర్లుకుంటూ వస్తోంది 'పీపాలో శవం' అని యాడ్ ఇచ్చేవారు. తలచుకుంటే నవ్వొస్తోంది. గాజు కన్ను, మొండిచేయి...సరదాగా ఉండేవి నా నవలల పేర్లు. వ్యాపారం అన్నప్పుడు నవలలు రాయాలి కదా! రాసేవాణ్ణి కాను. దాంతో ప్రగతి హనుమంతరావు బలవంతాన కూర్చోబెట్టి రాయించేవాడు. కాపలాగా తనూ కూర్చొనేవాడు. ఆ నవలలకు రావూరి భరద్వాజ ప్రూఫ్‌రీడర్‌గా ఉండేవారు. నేను నరేంద్ర పేరుతో డిటెక్టివ్ నవలలు రాస్తున్న సంగతి కొడవటిగంటికి తెలీదు. వారు 'ఖయాస్' పేరిట డిటెక్టివ్ నవలల మీద సెటైర్ రాసేవారు. నా నవలల మీద ఎప్పుడూ రాయలేదు. 'ఏంటాసార్! నరేంద్ర నవలల మీద సెటైర్ రాయట్లేదు' అనడిగితే 'ఆ నవలలు కొంచెం పర్వాలేదు. కొంచెం లాజిక్, మరికొంచెం సామాజిక ప్రయోజనం ఉంటున్నాయందులో' అన్నారు. నరేంద్ర నేనేనని అప్పుడు ధైర్యంగా అసలు సంగతి చెప్పేను. నవ్వారాయన.

## మనం ఎవరి పక్షమో తేల్చుకోవాలి

ప్రవృత్తిరీత్యా మహామహుల పరిచయం భాగ్యం కలిగింది. పిలకా గణపతిశాస్త్రి, సూరంపూడి సీతారాం, వి.ఎస్. అవధాని...ఎందరో మహానుభావులు అందరికీ వందనాలు. వర్ధమాన రచయితలకు నేను చెప్పేది ఒకటే! కథ రాస్తున్నావంటే...డబ్బు కోసం రాస్తున్నావా? కీర్తి కోసం రాస్తున్నావా? వృత్తిపరంగా రాస్తున్నావా? ఎందుకోసం రాస్తున్నావన్నది ముందే తేల్చుకోవాలి. అలాగే రచయితగా మనం ఎవరి పక్షం అన్నది కూడా నిర్ణయించుకోవాలి. తెలియని విషయాలను తెలుసుకుంటూ తెలిసిన జీవితాన్ని రాయడమే ముఖ్యం. వర్ధమాన రచయితలు వీటిని గుర్తుపెట్టుకుంటే గొప్పకథలు రాయొచ్చంటాను.

## రామయ్యా వస్తావయ్యా!

సినిమా రంగంతో కూడా చిన్న పరిచయం ఉంది. అప్పట్లో 'కినిమా' అని ఓ పత్రిక ఉండేది. సినిమా పత్రిక అది. దానికి మధుమూర్తి ఎడిటర్ అయితే నేను అసోసియేట్ ఎడిటర్‌గా ఉండేవాణ్ణి. 'చోరా-చోరీ' హిందీ సినిమా షూటింగ్ కోసం రాజ్ కపూర్ చెన్నయి వస్తే ఆయన్ని ఇంటర్వ్యూ చేయడానికి వెళ్ళాను. నేనాయన్ని అడిగిన మొదటి ప్రశ్న ఏంటో తెలుసా? 'శ్రీ 420' సినిమాలో 'రామయ్యా వస్తావయ్యా' అన్న తెలుగు మాట హిందీ పాటలో ఎందుకు వాడారని. దానికాయన నవ్వి ఏమన్నారంటే... 'యు ఆర్ నాటే రెగ్యులర్ జర్నలిస్ట్' అని, తర్వాత 'ఎందుకు వాడానంటే...ముంబాయి కామాటిపురాలో తెలుగువాళ్ళు పాలుపోస్తూ 'వస్తావా రామయ్యా' అని ఒకొర్నొకరు పిలుచుకునే వారు. ఆ మాట నాకు బాగా నచ్చింది. పాటలో వాడమన్నాను. దాన్ని సంగీత దర్శకులు అటునుంచి ఇటు చేసి 'రామయ్యా వస్తావయ్యా' అని వాడుకున్నా'రన్నారు.

## నా ఆఖరి కథ 'కుట్ర'

నేను రాసిన ఆఖరి కథ 'కుట్ర'. చెన్నయ్ నుంచి హైదరాబాద్‌కు వచ్చింతర్వాత నేను కథలు రాయలేదు. ఇకపోతే కుటుంబ విషయాలు: నా భార్య పేరు సక్కుబాయి. నాకిద్దరు పిల్లలు. రెండో అబ్బాయ్ వాసిరెడ్డి శ్రమణ్ రీజనల్ పాస్‌పోర్ట్ ఆఫీసరుగా పనిచేసి, ప్రస్తుతం జాయింట్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్స్‌గా ఉంటున్నాడు.

-జె.ఎస్.

## నచ్చినవి

| | | |
|---|---|---|
| రచయిత | : | కొడవటిగంటి కుటుంబరావు |
| కవి | : | దేవులపల్లి కృష్ణశాస్త్రి |
| నవల | : | మట్టిమనిషి (వాసిరెడ్డి సీతాదేవి) |
| సినిమా | : | మాయాబజార్ |
| హీరో | : | ఎన్టీ రామారావు |
| హీరోయిన్ | : | సావిత్రి |
| గాయకుడు | : | ఘంటసాల |
| గాయని | : | జానకి |
| పాట | : | ఆహా! నా పెళ్ళియంట (మాయాబజార్) |
| వంట | : | గోంగూర పచ్చడి |
| మిత్రుడు | : | తాపీచాణక్య |
| బంధువు | : | పాటిబండ్ల దుర్గాంబ (మా పిన్ని కూతురు) |

# నాకు నచ్చిన నా కథ

# ఎల్లమంద

- వనశ్రీ

**ఎల్లమంద ఎక్కడ పుట్టాడో ఎప్పుడొచ్చాడో ఎక్కడ్నుంచి వచ్చాడో ఆ ఊళ్ళో చాలా మందికి తెలియకపోయినా, యెల్లమంద ఎర్రిబాగులతనాన్ని గురించి గొడ్లకాడ పిల్లల దగ్గర్నుంచీ ఊళ్ళో పెద్దల వరకూ తెలుసు.**

మోతుబరి ఆసామి భద్రయ్య గారింట్లో గత పది సంవత్సరాలుగా జీతాని కున్నా ఎల్లమంద ఆత్మీయుల్ని గురించి భద్రయ్యగారికి అంతగా తెలియదు. అసలు ఎల్లమందకే 'తన్ను' గురించీ 'తన వాళ్ళను' గురించీ సరిగా తెలిసినట్టు తోచదు, అతడి వాలకం చూస్తే.

ఎవరన్నా పిలిచి ''ఏవూర్రా మీది'' అంటే--


''పడమట!'' అంటాడు తలకాయ ఎగరేసి.

''పడమట సరేలేరా! అక్కడేవూరు?'' అని అడిగితే--

''గులకలపాడు!'' అంటాడు. ఏదో నోట్లో కొట్టుకులాడుతున్న దాన్ని బయటికి కక్కేసినట్టుగా.

''అదెక్కడరా శాదిముండాకొడకా?'' అని రెట్టించి అడుగుతారు. అసలు ఎల్లమందను కదిలించిన వాళ్ళెవరైనా సరే.

''ఆఁ అదేనయ్యా! వో వొంటి వి ం ట్ట క ం



రెండు కోసుల దూరం అంటే!''

ఎల్లమంద ఎర్రిబాగులతనానికి తోడు నత్తి కూడా వొకటి పాపం! ఏదైనా మాట గట్టిగా చెప్పాలనుకొన్నప్పుడు, వుద్రేకం కోపం వచ్చినప్పుడూ ఎల్లమందకు నత్తి తోసుకు వస్తూంటుంది.

''ఓరి పిచ్చిముండాకొడకా!'' అని పగలబడి నవ్వతారు జనం.

''పోపోండయ్యా! ప-పరాశక మాట్టాండారు గాని!''

--కోపం తెచ్చుకొని అక్కడ్నుంచి గంతులు వేసుకొంటూ వెళ్ళిపోతాడు ఎల్లమంద. ఎల్లమందకు అంతలోనే కోపం వస్తుంది. అంతలోనే చల్లారిపోతుంది.

అలాకోపం తెచ్చుకొని చిందులు తొక్కుతూ పోయే ఎల్లమందను ''ఇదిగో! ఎల్లమందయ్యా మాట!'' అంటే ఠక్కిన ఆగిపోతాడు.

అల్లంత దూరాన నుంచునే ''ఏందీ?'' అంటాడు.

''ఓరి నీ గోల దొంగల్దోలా! యిట్టారా ఎల్లమందయ్యా!'' అంటారు వొచ్చే నవ్వును ఆపుకుంటూనే.

ఎల్లమందను, ''ఎల్లమందయ్యా'' అని పిలిస్తేచాలు బ్రహ్మానందమైపోతుంది. ''ఎల్లమందయ్యా'' అన్న మాట చెవుల పడితే చాలు ఆనంద పరవశుడై పోతాడు. ఎంత కోపం కూడా అంతలోనే మటుమాయమైపోతుంది. ''ఎల్లమందయ్య'' అని పిలిపించుకోవడం కంటే తనకు జీవితంలో ఆనందాన్ని కలిగించేది యింకేమీ లేదన్నట్టుగా అయిపోతాడు!

''ఏందయ్యా! నే పోవాలి, ఎద్దులకు వులవలు పెట్టాలి!'' తనలో తనే అనుకొంటూ, ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ పోయేవాడల్లా తిరిగి వస్తాడు.

''అది సరేగాని ఎల్లమందా! నీకు నీ వాళ్ళెవరూ లేరా?'' అని అడిగితే--

''నా-న్నావాళ్ళా! అంతా చచ్చిపోయారు!'' అంటాడు గబుక్కున.

కాని కాసేపు ఆగి మళ్ళా చెప్తాడు--

''మా అప్ప సెల్లెలుందండోయ్!''

''ఏవూళ్లో?''

'రాళ్ళపాలెంలో!''

''మరెప్పుడన్నా వెళ్ళావా'' అని అడిగినప్పుడు యేదో ఆలోచనలో పడిపోతాడు.

''మరి యిహ నీ చెల్లెలి దగ్గరకెళ్ళవా?'' అని అడిగితే--

''ఆఁ ఎల్తానండీ! యీ ఏడు మాసూ లవగానే తప్పకుండా ఎల్లాలి!''

''ఎళ్ళి మళ్ళీ తిరిగొస్తావా?''

''వత్తాలేండి!'' అని మళ్లీ సాలోచనగా అనుకుంటాడు. తనలో తను ఎల్లమంద -- ''మా బుల్లెమ్మ రానిత్తదో లేదో!''

అంతే! అసలు ఎల్లమంద వెళ్ళిందీలేదు, బుల్లెమ్మ రానివ్వందీ లేదు. ఏ సంవత్సరానికా సంవత్సరం వెళ్ళాలని అంటాడే కాని వెళ్ళటం మాత్రం ఉండదు.

-- ఇదీ ఎల్లమంద వరస. వూళ్లో ఎవరు ఎక్కడ నిలేసి అడిగినా యిదే ధోరణిలో చెప్పుకుపోతూంటాడు, వెళ్ళేపని కూడా మరచిపోయి.

తిని కూర్చొని, అరుగులమీదా, చెట్లకిందా కాలక్షేపం చేసే పెద్దలు దారిన పోయే ఎల్లమందను పిలిచి ఇలా ఆటలు పట్టించి నవ్వుకుంటూ వుంటారు. ఇహ కుర్రాళ్ళు సరేసరి! గోచీలాగి, తలగుడ్డలాగి, చంకలో కర్రలాగి ఎల్లమందను వుడికించి ఏడ్పించుతూ వుంటారు.

ముప్ఫై – ముప్ఫై రెండు ఏళ్ళ దరిదాపుల్లో వున్నట్టుగా కనపడతాడు ఎల్లమంద. కాయకష్టం చేసిన శరీరం, కండలు మెలికలు తిరిగి వుంటై. మొద్దు చర్మానికి తోడు రాగి రంగు! పెద్ద తాటికాయలా తలకాయ ముళ్ళపంది ముళ్ళలా తల మీద నిక్క పొడుచు కొని పొట్టిగా కత్తిరించిన నల్లటి జుట్టూ వుంటుంది. బండ పెదాలు; వాటి పైగా దుంగ మీద కూర్చున్న కప్పలా చప్పిడి ముక్కూ వికారంగా ఉంటాయి. అయితే, కళ్ళు నొసలూ, విశాలంగా మెరకగా వుంటాయి. కాని చూపు చెదురుమదురుగా తేలిపోతూ ఉంటుంది.

ఎల్లమంద కళ్ళు తెరిచి వున్నంతసేపూ నోరు తెరుచుకునే వుంటుంది. కొద్దిగా తెరిచిన నోట్లో నించి నాలుక మందంగా తొంగి చూస్తూ ఉంటుంది.

ఎల్లమంద నోరు తెరచి మాట్లాడబోయాడో పళ్ళన్నీ బయటికొచ్చి వుంటై. ఇహ మాట్లాడాడో వర్షం కురిసినట్టే నోట్లో నుంచి తుంపర పడుతుంది.

మోకాళ్ళయినా దిగని నీరుకావి మొలపంచ ఎడం వేపుకి ఉండగా చుట్టి దోపుకుంటాడు. గూళ్ళు దిగీ దిగని కోరా గుడ్డ బనీను వొంటికి బిగుతుగా కరుచుకొని

## అమాయకులను అవహేళన చేయకండి!



పాత్రలే కథలను నడుపుతాయన్న కొ.కు. మాటలను అక్షర సత్యంగా తీసుకుని నేనీ కథ రాశాను. అమాయకత్వానికి జాతి మత కుల పల్లె పట్టణ భేదాలుండవు. అమాయకుడెక్కడైనా అమాయకుడే! అమాయకులంటే నాకు జాలి. ఈ మాయామేయజగత్తులో అమాయకులను అక్కున చేర్చుకోవాలనే 'ఎలమంద'ను సృష్టించాను. పేరు అదే కాకపోయినా ఎలమంద లాంటివారు చాలామందిని నిజ జీవితంలో చూశాను. వారితో ఈ సంఘం ఆడుకోవడం చూశాను. వారి శ్రమను కొందరు దోపిడీ చేయడం చూశాను. వారి అమాయకత్వాన్ని చూసి ఆనందించడం చూశాను. పాపం పుణ్యం ప్రపంచ మార్గం ఏమీ ఎరుగని పసిపాపల్లాంటి 'ఎలమంద'లు సభ్య సమాజపు అతి తెలివి చేతిలో చిక్కి అన్యాయంగా బలై పోతున్నారు. ఈ కథ చదివాక 'ఎలమంద' లాంటి వారికి సాయం చేయకపోయినా బాధలేదు, కనీసం వారిని అవహేళన చేయకుండా, కష్టపెట్టకుండా ఉంటే చాలు! నా కథకు సార్థకత లభించినట్లే!


**–వనశ్రీ (వాసిరెడ్డి నారాయణరావు)**

ఫ్లాట్ నెం. 101, విదుషి విల్లా
రోడ్ నెం. 14, నంది నగర్
బంజారాహిల్స్, హైదరాబాద్ -500034
ఫోన్: 040-23540973


ఉంటుంది. అప్పుడప్పుడూ భుజాల వరకు చించేసిన చొక్కాలు కూడా తొడుగుతూ ఉంటాడు. భద్రయ్య గారి గూళ్ళు చినిగిపోయిన చొక్కాలన్నీ యల్లమంద సొత్తు.

"అదేమిట్రా సన్నాసీ! ఆ భుజాల దగ్గర మాసికలు వేయించి తొడుక్కోరాదూ?" అంటాడు భద్రయ్యగారు గూళ్ళు చినిగిపోయిన చొక్కా యిచ్చి.

"అదిగాదు లేండయ్యా! నాకిట్టాగే బాగుంటయ్!" అంటూ గూళ్ళ దగ్గర్నుంచీ పర్రున చించుతాడు చొక్కా యల్లమంద.

చించి, చేతుల్లేని చొక్కా తొడుక్కుంటూ––

"ఆ మిసినోడి దగ్గిరి కెవురు పోతారశా!" అని తనలో తను అనుకొంటాడు.

ఎల్లమంద అలా అనుకోడానికి ఓ కారణం ఉంది. ఇట్టాగే వోసారి ఎల్లమంద చొక్కా గూళ్ళమీద మాసికలు వేయించుకోటానికి "మిసినీ సాయిబు మత్తానయ్య" దగ్గర కెళ్ళాడు.

మిషన్ సాయిబు చొక్కా కుట్టి పెడతాలే కూర్చోమని ఆ మాటా ఈ మాటా చెప్తూ, వెనగ్గా తలపై అరిచేతి వెడల్పున జుట్టు కత్తిరేసి పంపించాడు.

ఏవిటో పాపం ఎర్రిబాగుల ఎల్లమందను చూస్తే అందరికీ అలుసుగా వుంటుంది. ఏదో వొకటి కొంటెపని చేయాలనిపిస్తుంది.

చొక్కా కుట్టించుకొని ఇంటికొస్తోన్న ఎల్లమందను మహలక్ష్మమ్మ చెట్టుకింద చేరి కబుర్లు చెప్పుకుంటున్న వాళ్ళలో ఒకాయన చూసి పిలిచి అడిగాడు.

"అదేందిరా ఎల్లమందా?"

"మాసికేయించు కొత్తొన్నానండీ!" అన్నాడు గర్వంగా చంకలో ఉన్న చొక్కాను చూసుకుంటూ ఎల్లమంద.

చెట్టుకింద జనం అంతా గొల్లుమన్నారు. ఎల్లమంద వెనక్కు తిరగ్గానే తల మీద వున్న మాసిక చూసి.

"ఎవుర్రా మాసికేసింది?" వో కుర్రాడు అడిగాడు.

"మి-మ్మి-సిన్నాయిబు-మమ్మ- మ్మత్తానయ్యండీ!" ఎల్లమందకు కోపం వచ్చింది అంతా నవ్వేసరికి.

ఇద్దరు యువకులు వెళ్ళబోతున్న యెల్లమందను బలవంతంగా లాక్కొచ్చి కూర్చో పెట్టారు. జనం చుట్టూ చేరి ఎల్లమంద నెత్తిమీద చేతులు పెట్టి కొట్టూ గుక్కపట్టి నవ్వడం సాగించారు.

అందులో వొకడు అన్నాడు––

"మస్తానయ్య యల్లమంద తలకు భలే మాసిక వేశాడ్రా!'

"చొ-చొక్కాకు మాసికేశాడంటే –– త-త్తలకాయ కేశాడటంటారేంటశో" అన్నాడు ఎల్లమంద పౌరుషంగా.

గుంపు అంతా పొట్ట చెక్కలయ్యేట్టు నవ్వింది. ఎల్లమందకు కంపరమెత్తిపోయింది. గుంపును తోసుకుని బయటపడ్డాడు.

"మ్మీ-మ్మీయమ్మ! మీదంతా యగతాలిగాని! తలకాయ మాసికంటారు! మ్మీ-మ్మీ-తలకాయే మాసిక!" అని తిట్టూ వెళ్ళిపోయాడు యల్లమంద.

అప్పట్నుంచీ యల్లమందకు మిషన్ సాయిబంటే తగని భయం. యజమాని చినిగి పోయిన ఏ చొక్కా యిచ్చినా పర్రున చేతులు చించి తొడుక్కుంటాడు. మాసికన్నా, మస్తాను సాయిబన్నా గుండెల్లో వళ్ళు తెలియని బెదురు ఎల్లమందకు.

భయమంటే గుర్తొస్తోంది. ఎల్లమందకు యిట్లాంటి భయమే యింకోటి ఉంది. కాకీ డ్రెస్సూ, టోపీ చూస్తే చాలు బెదిరిపోయిన గొడ్డులా చేలకు అడ్డం పడి పరుగెత్తుతాడు.

ఓసారి, మిలటరీ నుంచి తిరిగొచ్చిన యోసోబును చూట్టానికి వూళ్ళో కుర్రాళ్ళు కొంతమంది వెళ్తుంటే, వాళ్ళతో కలిసి యెల్లమంద కూడా వెళ్ళాడు.

యోసోబు మిలటరి బూటూ, కాకీడ్రెస్సూ, టోపీ ఆశ్చర్యంగా చూశాడు యల్లమంద. వాళ్ళ మాటలు వింటూ అటే చూస్తుంటే యల్లమంద బుర్రలో ఓ సందేహం మెదిలింది ఉండీ ఉండి వుండబట్టలేక అన్నాడు––

"ఏసోబియ్యా! మీ దగ్గరేందో గుండేసేది వుందంటనే?" అని పళ్ళికిలించాడు.

అంతా ఒక్కసారి ఫక్కున నవ్వారు.

"తుపాకంటరా?" అన్నాడు ఒకడు.

ఔనన్నట్టు తల యెగరేశాడు యల్లమంద.

యోసోబు, యింకా యిద్దరు ఏదో గుసగుస చెప్పుకొన్నాక వాళ్ళల్లో వొకడన్నాడు.

"ఒరే యోసోబూ! యల్లమందకు తుపాకంట చూపించారా?"

'చూపియ్యశో' అన్నాడు ఎల్లమంద.

ఏసోబు లోపల్నుంచి పన్ను దిగేసిన లాఠీ కర్రొకటి తీసుకొచ్చాడు.

ఎల్లమంద లాఠీని, చివర ఉన్న గుండ్రటి ఇత్తడి పొన్నూ ఎగాదిగా చూసి "ఒరి నీ – యమ్మ.... యిందులో గుండా గుండెట్టా వత్తదశ!"

"వత్తది లేవోయ్! దాన్లో మరుంది, మరి! అది వత్తితే గుండొస్తది!" చెప్పాడు ఏసోబు.

"ఎట్టెట్టా?" అన్నాడు కళ్ళు పెద్దవి చేసి ఎల్లమంద.

"సరే! ఆ చెట్టు మీద ఉన్న పిట్టను కొట్టా చూసుకో ఎల్లమందా" అన్నాడు ఏసోబు.

ఎల్లమంద చెట్టు మీద ఉన్న పిట్టవంకే నోరు తెరుచుకు చూస్తోండగా, అతడి వెనక్కి ఒకడు చేరాడు. ఏసోబు ఎల్లమంద వెనక నుంచొని చేతుల్లో వున్న కర్రతో తుపాకిలా పిట్టకేసి గురి పెట్టాడు.

ఆశ్చర్యంతో కళ్ళూ నోరూ తెరచుకుని చూస్తోన్న ఎల్లమంద మెడకు బెత్తడు ఎడంగా తల మీద "టాంగి"న మోగింది! పిచ్చికేక వేస్తూ ఒక్క గంతువేసి కింద పడ్డాడు.

చుట్టూన్న వాళ్లంతా గోలగా నవ్వారు.

వెర్రిబాగుల యల్లమంద చెట్టుకేసి ఆదమరచి చూస్తోండగా వెనగ్గా వొకడు కంకర్రాయితో గుద్దాడు.

"గురితప్పి గుండు మన ఎల్లమందకు తగిలినట్టుందే?" యల్లమంద దగ్గర కొస్తో అన్నాడు ఏసోబు.

యల్లమంద తెప్పరిల్లి లేచి కూర్చున్నాడు. బిత్తరిపోయిన చూపులతో మిలటరీ వాడి చంకలో వున్న లాఠీని చూశాడు.

''ఏసోబియ్యా యీసారి సరిగా వెయ్యవయ్యా గుండు!''

అంతే! ఆ మాట వింటూనే పరుగు లంకించుకున్నాడు యల్లమంద. మళ్ళీ భద్రయ్య గారింటికి పోయి గాని తిరిగి చూడలేదు.

పాపం! ఎల్లమందకు ఆ రోజు నుంచీ మిలటరీ వాళ్ళన్నా, పోలీసులన్నా హడలే! వాళ్ళ దగ్గర గుండేసే తుపాకీ కట్టెలుంటాయి కాదూ మరి!

ఎల్లమందకు నిత్యజీవితంలో కావాల్సిందేమిటో భద్రయ్యగారికి బాగా తెలుసు. వేళకింత అన్నం; నోట్లోకి అంత పుగాకు. వాటికి తక్కువ కాకుండా చూస్తూ వుంటారు భద్రయ్య గారు.

ఎల్లమంద నలుగురు పెట్టు. ఎంత తింటాడో అంతపనీ చేస్తాడు. కాటా బస్తాను అవలీలగా ఎత్తుకుంటాడు. ఇద్దరు మోసే చొప్పమోపు వుత్తరప్పొలాన్నుంచి సునాయాసంగా తెస్తాడు. అడ్డెడు సజ్జలు రోట్లో పోసి రోకలిస్తే గంటలో కుమ్మేస్తాడు యల్లమంద.

భద్రయ్య గారింట్లో, తెల్లవారుఝామున లేచిన ఎల్లమంద రాత్రి వో ఝాము పొద్దు పోయిందాకా ఏదో పని చేస్తూనే వుంటాడు. వూరికే కూచుంటే వాడికి అసలు తోచదులా ఉంది--

ఇంతా చేస్తే భద్రయ్య యెల్లమందకు ఏమిస్తాడయ్యా అంటే ఆ పైవాడికే తెలియాలి?

ఎంతరా నీ జీతం అంటే యల్లమంద అంటాడు గదా--

''ఆ -అన్నం పెట్టీ గు-గుడ్డలిచ్చీ ము-ముప్పై రూపాయలు!''

పది సంవత్సరాల నుంచి యల్లమంద జీతానికున్నా భద్రయ్య పట్టుమని వొక రూపాయి అయినా వాడి చేతిలో పెట్టినట్టు ఎవరూ చూడలేదు. ఆయనగార్ని మాటవరసకు ఎవరైనా అడిగితే అంటాడు--

''శాదాడు! వాడికిస్తే ఆగం చేసుకుంటాడు! వాడి డబ్బంతా లెక్కకట్టి దాస్తూనే ఉన్నాను''.

అప్పుడప్పుడు ఎవరన్నా బాగా ఎక్కించి పురిగొల్పి పంపితే. ఆ రోజు ఎల్లమంద యింటికొచ్చి యజమానితో పేచీ వేసి గోలచేస్తాడు.

''న్నా-న్నా ముప్పై రూపాయలు నా కియ్యండయ్యా! ఆ - అంతా తినేస్తున్నారు!''

ఎల్లమంద వాలకం గ్రహించి, చిరునవ్వు నవ్వుతూ తలెగరేసి భార్యను పిలుస్తాడు.

''ఏమేవ్! ఇవ్వాళ యల్లమందకు గోంగోరేసి అన్నం పెట్టు! పెరుగుందా?''

''మళ్ళీ ఏం పురుగు తొలిచిందిరా చచ్చినోడా! రా మింగుదువుగాని!'' అంటుంది భద్రయ్య పెళ్ళాం నర్సమ్మ.

ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ పోయి యల్లమంద గిన్నె కడుక్కుంటాడు.

యల్లమంద అన్నం తినొచ్చేసరికి, భద్రయ్యగారు గుప్పెడు నాసిరకం కేటు పుగాకు, ఓ పావలాబిళ్లా వాడిచేతులో పెట్టాడు.

అంత పొగాకు వొక్కసారి తన చేతులో పడేసరికి ఎల్లమంద గుండెలు గుబగుబలాడి పోతాయి.

పావలా బిళ్ళ, పొగాకు బొడ్లో దోపుకుని, గొడ్లనిడిచి మాంచి వుషారుగా పొలం తోలుకెళ్తాడు.

దోవలో, సుబ్బమ్మ కాఫీకొట్టు దగ్గరకు రాగానే లోపలికి తొంగి చూసి అంటాడు--

''ఏంది రంగయ్యోయ్! సేత్తన్నావ్?''

''ఎల్లమందయ్యా రారా! మాట!'' పిలుస్తాడు పక్కీగాడితో చేరి సుబ్బమ్మతో సరసాలాడుతోన్న రంగయ్య.

''ఎహెయ్! టుర్!'' గొడ్లను వోసారి అదిలించి ''పోవాలయ్యా!'' అంటూనే లోపలికొస్తాడు ఎల్లమంద.

''యాడికిపోయావ్ రంగయ్యా! ప-ప్పత్తాలేదూ?''

''అదే! ఊరికి పోయి నిన్నే వచ్చా!'' అంటాడు రంగయ్య.

''ఏ-ఏ వూరెల్లా రంగయ్యా?''

''పడవటెల్లొచ్చా యల్లమందా!''

''ఆ-అయితే మా అప్ప సెల్లెలు క-క్కనపడిందా రంగయ్యా'' ఆదుర్దాగా అడుగుతాడు ఎల్లమంద.

''ఆс కనపడిందోయ్! ఏ వూరో ఎళ్ళొస్తూ రైల్లో కనపడింది!''



''ఏ-ఏంవంది రంగయ్యా?''

''ఆс పాపం! నీ సంగతే అంది. ఎప్పుడొస్తావో ఏమోనని?'' సుబ్బమ్మకు కన్ను గీటుతూ అంటాడు రంగయ్య.

''మాసూలవగానే యెళ్ళాలి!'' సాలోచనగా, దిగులుగా అంటాడు యల్లమంద.

కాసేపాగి ఏదో గుర్తుతెచ్చుకొని అంటాడు--

''మా సుక్కమ్మ కూడానే వుందా?''

''సుక్కమ్మంటే నీ అక్క కూతురేగదూ? వెంబడే ఉందోయ్!''

''పెద్దదయిందా?'' అంటాడు ప్రశ్నార్థకంగా యల్లమంద.

''ఎల్లమంద మావయ్యనే చేసుకుంటా నంటందిరా?''

ఎల్లమందకు వొళ్ళంతా చక్కిలిగింతలు పెట్టినట్టవుతుంది.

''మా మావయ్య పెళ్ళానికి మల్లెపూలు పంపేడా అని అడిగిందిరా మీ సుక్కమ్మ!'' రంగయ్య ఎల్లమంద బొడ్లో దోపి వున్న పావలా బిళ్ళకేసి చూస్తో అంటాడు.

ఎల్లమంద వో క్షణం మౌనంగా చూసి--

''రంగయ్యా! మళ్ళీ ఎళ్తావా పడవటికి?'' అంటాడు.

''నాలుగు రోజుల్లో వెళ్ళాలి?'' అంటాడు రంగయ్య కప్పుకేసి చూస్తో.

బొడ్లో నుంచి పావలాబిళ్ళ తీసి రంగయ్య చేతిలో పెట్టి-

''మా సుక్కాంకు పూ - పూలు కొనియ్యి!'' అని గబగబా వెళ్ళిపోతాడు ఎల్లమంద.

రంగయ్యా, సుబ్బమ్మలు నవ్విన వెకిలినవ్వుల్లో యల్లమంద అడుగుల సవ్వడి కలిసిపోతూంది.

''స్ట్రాంగ్ కాఫీ యియ్యి సుబ్బమ్మా!'' అంటాడు పావలాబిళ్ళ ఎగరేస్తూ రంగయ్య.

''నీ గుడ్డు మాడా! పిచ్చోణ్ణి మాయం చేసి తీసుకొన్న డబ్బులు!'' అంటుంది సుబ్బమ్మ మురిపెంగా, పావలా బిళ్ళ గల్లాలో వేసుకొని.

--అదీ ఎల్లమందయ్య వెర్రిలోకంలో లోకులు ఆనందించే తీరు.

దారేపోయే ఎల్లమందయ్యను పిలిచి ''మా నాయనగా! ఓ జోడు నీళ్లకందుకో!'' అంటే పది జోళ్ళ నీళ్ళు పోసి మరీ పోతాడు. కాస్త పుగాకు కూడా పెడితే మోపెడు కట్టెలు పగలేసి మరీ పోతాడు.

ఎల్లమంద మాడుమీద రెండంగుళాల వెడల్పున వో మచ్చ ఉంది. అది చూసి ఎవరన్నా ''ఏమిట్రా అది?'' అంటే--

''సిన్నప్పుడు తాడి చెట్టుమీద నుంచి పడ్డానంట!'' అని తల నిమురుకొంటాడు ఎల్లమంద.

మధ్యాహ్నం గొడ్లను కాసుకు రావడానికి పొలం వెళ్తే ఎల్లమంద చుట్టూ చేరి ఏడిపిస్తూ ఉంటారు గొడ్లకాడ బుడ్డోల్లంతా!

''అదేందిరా ఎల్లమందా?'' అంటాడు నర్సిగాడు.

''తాడిచెట్టు మీన్నుంచి పడ్డానంటలే సిన్నప్పుడు!'' రోజూ అదే సమాధానం చెప్తాడు ఎల్లమంద.

''కాదులే! గుఱ్ఱం తన్నిందటగా?'' అంటాడు కోటిగాడు.

''కాదులే! గాడిద తన్నిందటలే'' అంటాడు సుబ్బాయి.

అంతలో ఎల్లమంద నెత్తిమీద ముసుగు వేస్తాడు వొకడు తలో దెబ్బా వేస్తారు. ఎల్లమందకు కోపం వచ్చి అరిచేసరికి తలో పక్కన పారిపోతారు.

పొద్దున్నే లేవడం; అన్నపేళదాకా యింట్లో చాకిరీ చేయడం; అన్నం మూట కట్టుకొని గొడ్లను విప్పడం; సాయంకాలం దాకా పొలాన కుర్రాళ్ళ, గొడ్ల మధ్యా నలగడం; పచ్చి గడ్డిమోపు నెత్తిన వేసుకొని పొద్దుపోయే సరికి యింటికి చేరడం; దారిలో ఎవరైనా పిలిచి "యల్లమందయ్యా" అని అడిగితే చెప్పిన పనిచేసి రావడం -- ఇలా వెళ్ళమారిపోతోంది యెల్లమందయ్య బతుకు.

ఇంతవరకూ యెల్లమందయ్య వెర్రిబాగుల తనం లోకంలో యితరులకు ఉపయోగ పడిందే గాని అపకారం చేయలేదు. కాని--

***

ఒక రోజున పొలాన--

"ఏయ్! ఏహయ్!! తి-తిరిగో!' ఎల్లమంద కట్టమీద నుంచొని కేకేశాడు.

కోటిగాడి గేదె పెసర చేలోపడి పరపరా తింటున్నది. కోటిగాడు అల్లంత దూరంలో నుంచొని చూడనట్టే గేదెను భద్రయ్య గారి పెసర చేలో మేపుతున్నాడు.

"ఓ-ఓరేయ్ కోటిగా నే-న్నే వచ్చానంటే ప-ప్రాణం తీత్తా?" మళ్ళీ కేకేశాడు యల్లమంద.

కోటిగాడు బర్రెను మళ్లేయడం అలా ఉంచి, గొర్రెపోతు పలుపు విప్పి చేలో వదిలాడు.

ఎల్లమందకు వళ్ళు తెలియని కోపం వచ్చింది. రంయిన కట్టమీద నుంచి చేలోకి పరుగెత్తాడు. ఎల్లమంద రావడం చూసి కోటిగాడు యల్లమందకు చిక్కకుండా కట్టమీదకు పరుగెత్తాడు.

ఇవ్వాళ కోటిగాడు యల్లమంద మీద పగపట్టాడు. నిన్న యల్లమంద బర్రె మీదకు కర్ర విసిరితే పక్కనే ఉన్న కోటాయికి తగిలింది. అదీ వాడి కోపం యల్లమంద మీద, ఎలాగయినా కసి తీర్చుకోవాలని పూని వున్నాడు కోటాయి.

ఎల్లమంద పెసరచేలో పడ్డ బర్రెను నాలుగు బాది మళ్లేసి వచ్చేసరికి కాలవ కట్టమీద చెట్టుకు వేలాడకట్టి ఉన్న అన్నం మూట కాస్తా మాయమైంది.

"ఇయ్యేండశ అన్నంకాడ పరాశక మేంది?" అన్నాడు యల్లమంద. నర్సయ్య, పోలాయి, చింతడూ మాకు తెలియదంటే మాకు తెలియదన్నారు.

"నా-న్నాయాల! క్కొ-కోటిగాడి పనే?" కోపంతో అరిచాడు యల్లమంద.

ఎడంగా చెట్టుకానుకు నుంచున్న కోటాయి కసుక్కున నవ్వాడు.

"నత్తోడోయ్!" నన్ను అన్నావంటే తంతాన్రోయ్!"

పదమూడు పద్నాలుగేళ్ల వయసులో ఉన్న కోటాయికి ముప్ఫైయేళ్ళ ఎల్లమందను అలా ధిక్కరించి అనే ధైర్యం ఎక్కడ్నుంచి వచ్చిందీ వేరే చెప్పాల్సిన పని లేదు'. ఎర్రిబాగుల ఎల్లమంద అంటే అందరికీ అలుసే!

"యాడ దాశావురా? అ-అన్నం మూట!" అంటూ యల్లమంద ఎడంగా కూర్చున్న కోటాయి మీదకు పరిగెత్తాడు.

కోటాయి మీదకు పోతూన్న యల్లమంద కాళ్ళమధ్య వొకడు కర్ర తగిలించాడు. కాళ్ళు మెలిపడి తుపుక్కున కింద పడ్డాడు యల్లమంద.

మిగతా వాళ్ళంతా యీలలూ, కేకలూ వేశారు. కోటాయి అదే పరుగు! యల్లమందకు దొరక్కుండా పారిపోయాడు.

కిందపడ్డ ఎల్లమంద దిమ్మిరపోయాడు. దోక్కుపోయిన మోకాళ్ళు నిమురుకొంటూ లేచి నించొన్న యల్లమందకు తన్ను ఎవరు పడేసింది అంతుపట్టలేదు.

రావడానికి మాత్రం కోపం అందర్నీ మింగేయాలన్నంత వచ్చింది. కాని యేం చేస్తాడు?


అందర్నీ కలిపి నోటికి వచ్చిన బూతులు తిట్టాడు. చివరకు తన కోపాన్ని తనే దిగమింగు కొంటూ వాళ్ళ నుంచి దూరంగా వెళ్ళిపోయాడు.

మిట్టమధ్యాహ్నం, పొద్దు నెత్తిమీదకొచ్చింది. ఎండ నెత్తిమాడుస్తోంది!

ఎల్లమంద కడుపులో ఆకలి చిచ్చు రగులుకొంటూంది. కాలుగాలిన పిల్లిలా అన్నం మూట కోసం ప్రతి దుబ్బూ, ప్రతి పొదా, ప్రతి గుంటా వెదికాడు. పొద్దు తిరిగిందాకా వెతికినా ఎక్కడా కనిపించలేదు పాపం?

రోజూ ఆ వేళకు చేలో ఉన్న మెరకదిబ్బ మీద రెండు వాటాల గడ్డి దోకేవాడు. యివాళ వొక్క పరకైనా యింతవరకూ దోకలేదు. పచ్చిగడ్డి మోపు లేకుండా ఇంటికిపోతే భద్రయ్య గారు ఎగబడతారు?

ఎల్లమంద కళ్ళమీద ఎడం చేయి అడ్డం పెట్టుకొని పొద్దువంక చూశాడు. పొద్దు వాటాలిపోతోంది. ఆదరాబాదరా పెసరచేలో వున్న మెరక దిబ్బ మీదకు



పోయి దోకుడు పార తీసుకొని గడ్డి దోకడం మొదలు పెట్టాడు.

ఇంకా రెండుబారలు పొద్దుంది. గడ్డి రెండు వాటాలయింది. ఎల్లమందకు శరీరం చెమటలు కారిపోతోంది. దోక్కుపోయిన మోకాళ్ళు చురచుర లాడుతు న్నాయి. కడుపులో ఆకలిమంటలు దహించుకుపోతున్నాయి. గుండెలు వేగంగా కొట్టుకుంటున్నాయి. చేతిలోని దోకుడుపార పచ్చగడ్డి నేల మీద ''పరపర'' లాడు తోంది. యల్లమంద బుర్రలో హోరుసాగింది--

ఆ హోరులో -- అన్నం మూట! కోటాయి! అన్నం మూట!! కోటాయి!!

ఎల్లమంద ఏదో చప్పుడైన శబ్దం విని తల పైకెత్తి చూశాడు.

తన యజమాని పెసరచేలో గొడ్లు పడి మేస్తున్నాయి! ఎరగనట్టే ఎడంగా నుంచున్నాడు కోటాయి!!

ఎల్లమందకు వళ్ళు మండింది. అసలే తిక్కమనిషి. దానికి తోడు ఆకలితో మండి పోతూన్న మనిషి. ఎల్లమందకు ఉన్నమతి కాస్తా పోయింది!

ఇహ చూడు నాయనా, యెల్లమంద వళ్ళు తెలియని వెర్రి ఆవేశంతో, చేతిలో ఉన్న దోకుడు పారతో వొక్క దూకు దూకాడు!

''వొరే కోటిగా!'' అంకె వేశాడు యల్లమంద.

మెరక దిబ్బ మీద నుంచి దూకిన దూకడం పెసర చేను గట్టు పక్కన వున్న కోటిగాడి దగ్గరొచ్చి వాలాడు..

వెన్నిచ్చి పిక్కలకొద్దీ పారిబోతున్న కోటిగాడి తల మీద చేతిలో వున్న దోకుడు పారతో లాగి ఒక్క తీత తీశాడు యెల్లమంద.

''అమ్మో!''

బిళ్ళం గోడులా పైకి లేచి కింద పడ్డాడు కోటిగాడు!

పంటచేలో పడి విలవిలా తన్నుకుంటోన్న కోటిగాడి కణతల మీదినించి, ముక్కుల్లోంచి వుబికి వస్తోన్న రక్తం పచ్చగడ్డిని తడిపి నెరియల్లోకి జారిపోతోంది!

ఎల్లమంద చేతులో వున్న పార అవతల పారేసి తత్తరతో చేలకడ్డం పడి పరిగె త్తసాగాడు.

కొంతమంది పరిగెత్తిపోతూన్న యల్లమందను తగిలి పట్టుకొన్నారు.

ఎల్లమందను పట్టుకొని రొమ్ముల మీదా, డొక్కలోనూ కుమ్మారు చావచితక బాదారు.

ఎల్లమంద వళ్ళు హూనాం హూనాం అయిపోయింది. శరీరమంతా కమిలి నెత్తురు ముద్దయిపోయి, యింటికి చేరాడు యల్లమంద.

ఇంటికొచ్చిన యల్లమందను చూసి యజమాని భద్రయ్య కొయ్యబారిపోయాడు.

తెప్పరిల్లుకొని -- ''ఏం జరిగిందిరా, ఎల్లమందా?'' అని అడిగాడు.

ఎల్లమంద నోట మాట లేదు. అర్థరహితంగా దీనంగా యజమాని కళ్ళలోకి చూశాడు.

కోటిగాడి మరణవార్త వూళ్లో గప్పుమంది! ఊరంతా వొకటే మాట వినబడుతోంది-

''ఎల్లమంద పిల్లాడ్ని చంపాడు!'' అందరినోటా అదే మాట.

ఆ రాత్రి యల్లమంద గొడ్లసావిట్లో చేరి వోమూల ముడుచుకుని పడుకొన్నాడు.

రాత్రి భోజనాలు అయాక వూళ్లో పెద్ద తలకాయలన్నీ భద్రయ్య గారింట్లో సమావేశమయినై.

''ఏం చేద్దాం?'' సలహా అడిగాడు భద్రయ్య గారు.

''ఏదో వొహటి చేయాలి! పోలీసులకు తెలిస్తే తంటా వచ్చి పడుతుంది!'' అన్నాడు రత్తయ్య.

''అదే అడుగుతున్నాను?'' అన్నాడు భద్రయ్య.

''కోటిగాడి తండ్రి చేతిలో రెండొందలు పెట్టి సర్ది చెప్పితే సరి!'' నరసింహయ్య సలహాగా అన్నాడు.

''రెండొందలే!'' భద్రయ్య గారికి గుండెలు చిక్కపట్టినై.

''ఆc -- అంతవరకైనా ఇవ్వకపోతే వాడొప్పుకోడు! శవాన్ని పోలీసులొచ్చిం దాకా వుంచుతానంటున్నాడు కోటిగాడయ్య!'' అన్నాడు రత్తయ్య.

''వాడికి రెండొందలిచ్చినా పోలీసుల బెడద లేకుండా పోతుందని నమ్మకమేముంది?''

''వాళ్లకూ ఆ చేతుల్తోనే విదిలిస్తే సరి!''

''ఆc అంతే! ఇంకో రెండొందలు నీవి కావనుకో భద్రయ్యా! పాపం వెర్రోడి మొహం చూసి!'' అన్నాడు రత్తయ్య.

''అదికాదు రత్తయ్య మామా! ఇంతా చేస్తే ఆ పిచ్చాడు మళ్ళీ ఇట్లాంటి పని చేయకుండా వుంటాడనే నమ్మకమేముంది?'' భద్రయ్య గారికి ధర్మ సందేహమొ చ్చింది. అసలు విషయం యల్లమంద ప్రాణాల మీదకంటే భద్రయ్య గారికి నాలుగు పచ్చనోట్లపైనే ప్రేమ జాస్తి! అని గ్రహించి--

''అదీ నిజమేలే భద్రయా!'' అన్నాడు రత్తయ్య.

''కాకపోతే యీ వెర్రాడ్ని పెట్టుకొని పీకల మీదకెవరు తెచ్చుకొంటారు?'' అన్నాడు భద్రయ్య.

''సరే! నీ యిష్టం! వస్తాం!'' అని చెప్పి రత్తయ్య, నరసింహయ్యలు లేచి వెళ్ళారు.

''ఒరే యల్లమందా!''

''ఏందయ్యగోరూ!'' మగత నిద్దర్లో ఉన్న యల్లమంద తత్తరపోయి లేచి కూచు న్నాడు. యల్లమంద చేతిలో పది రూపాయల నోటు వుంచాడు యజమాని.

''ఎ-ఎందుకూ? ఎ-ఎక్కడికీ?'' అమాయకంగా అన్నాడు యల్లమంద.

''ఓరి పిచ్చివాడా? యిక్కడుంటే పోలీసులొచ్చి పట్టుకుపోతార్రా?''

''పో-పోలీసులే!'' పోలీసులనేసరికి యల్లమంద గుండెల్లో రైళ్ళు పరుగెత్తినై!

''ఇ-ఇంత సీకట్లో యాడికి పోయేది?'' అమాయకంగా జాలిగా యజమాని మొహం లోకి చూస్తూ అన్నాడు యల్లమంద.

''ఎటోకటు పో! తెల్లారేదాకా వుంటే పోలీసులొచ్చి పడ్తారు?''

యజమాని యల్లమందను బయటికి పంపి సావిటి తలుపు బిగించాడు.

ఎల్లమంద రాత్రంతా వూళ్లో తిరిగి తిరిగి, తెల్లవారు ఝామునకు సత్రం అరు గుల మీద పడి నిద్రపోయాడు.

ఉదయాన సత్రం ముందు చేరి ఆడుకొంటూన్న పిల్లల్ని చూస్తూ వాళ్ళ మధ్య కూర్చుని వున్నాడు యల్లమంద.

పిల్లల్లో ఒక్కడై వాళ్ళ మాటల్లో ఆటల్లో నిమగ్నమై తన్మయత్వం పొందుతూన్న అమాయకుడు యల్లమంద విశాలమైన భుజాలపై బలమైన చేతులు పడినై.

''పోలీసులు! పోలీసులు!!'' అరుస్తో ఆడుకొంటూన్న పిల్లలంతా చెల్లాచెదు రుగా పరిగెత్తారు.

బేడీలు వేసిన చేతుల్తో పోలీసుల మధ్య వెళ్తూన్న యల్లమంద గుండెల్లో భయం కట్టలు తెంచుకొంది!

***

ఎల్లమందకు వేడినీళ్ళ సాన్నం చేయించి కొత్తబట్టలు తొడిగి వార్డర్లు జైలర్ కోసం ఎదురు చూస్తూ ఉన్నారు.

''ఎల్లమందయ్యా! నిన్ను చూడటానికి ఎవరూ రాలేదు! నీ వాళ్ళెవరూ లేరా?'' సెల్ లోకి వస్తూనే అడిగాడు జైలర్.

''ఉ-ఉన్నారు దొరా! మా అప్ప సెల్లెలుంది! దాని కూతురు సు-సుక్కాం ఉంది!''

''రాలేదేం మరి!''

''ప-ప్పడమట! శా-శ్శానా దూరముంది దొరా! ఆనోళ్ళు గదా ఎట్టా వత్తారు? దీపాల పండక్కి నేనే ఎల్లొత్తా!'' ఎల్లమంద ముఖంలోకి చూడలేక తల పక్కకు తిప్పుకున్నాడు జైలర్.

''నీ డబ్బు పది రూపాయలున్నయ్ మా దగ్గర! ఎవరికి పంపించమంటావ్?''

''న్నే-నేను ఎల్లేప్పుడు ఇయ్యండి దొరా! మా-మా సుక్కాంకి పూలు కొను క్కెల్తా!' ఎల్లమంద కళ్ళల్లో విరిసిన వెలుగులు చూడలేక జైలర్ కళ్ళజోడు తీసి అద్దాలు తుడుచుకొని మళ్ళీ పెట్టుకొన్నాడు.

''ఈ రోజు నీకు ఇష్టమయిన భోజనం పెట్తాం. ఏం కావాలో చెప్పు?''

''క-క్కడుపు నిండా పెట్తారా? పె-ప్పెరుగేసి అన్నం పెట్టండి?''

''పిచ్చివాడయినా బతికిపోయేవాడు. అమాయికుడయిపోయాడు!'' జైలర్ జాలిగా ఎల్లమంద కళ్ళల్లోకి చూశాడు.

''ఆc నువ్వు తిన్నంత పెట్తాం. నువ్వు కోరింది ఏదయినా పెట్తాం! చెప్పు! ఇంకా ఏం కావాలీ!'' నూతిలోనుంచి వచ్చినట్టుగా ఉంది జైలర్ గొంతు.

''ఇ-ఇయ్యాల పండగా?'' ఉక్కిరిబిక్కిరి అయిపోయాడు ఎల్లమంద.

''ఆc! ఆ పండగే! నిన్ను ఉరితీసే పండగ!'' తన కడుపులో తానే బాకుతో పొడుచుకొన్నట్టు అరిచాడు జైలర్.

''ఉరి తీయబోయే ముందు నీ చివర కోరిక తీర్చడం జైలు ఆనవాయితీ!'' ఎల్ల మందకు వివరించి చెప్పాడు వార్డర్.

''ఆc! అట్టయితే న-నన్ను రో-ర్రోజూ ఉరితీయండి దొరా!''

జైలర్ గోడవైపు తిరిగి యీసారి కళ్ళద్దాలతో పాటు కళ్ళు కూడా తుడుచుకొ న్నాడు.

*

*'ఆంధ్రజ్యోతి' మాసపత్రిక, 1954*